క్లుప్తంగా

శతశాతం రికవరీ చేయాలి



వెలుగు శిక్షణ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్ జయకుమార్

బలిజిపేట: స్త్రీ నిధికి సంబంధించి రుణాలు, రికవరీ శతశాతం పూర్తిచేయాలని స్త్రీ నిధి మేనేజర్ జయకుమార్ సూచించారు. వెలుగు శిక్షణ కార్యాలయంలో వీఓఏలతో శుక్రవారం రివ్యూ సమావేశం నిర్వహించారు. స్త్రీ నిధి రుణాల మాంజూరు, రికవరీ మార్చి 31వ తేదీ నాటికి శతశాతం పూర్తిచేయాలని స్పష్టం చేశారు. 2022–23ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్త్రీ నిధి రుణాలు రూ.6కోట్లు టార్గెట్ కాగా ఇప్పటికి రూ.1.80కోట్లు ఇచ్చినట్లు చెప్పారు. దానిలో 92శాతం రికవరీ అయిందని మిగిలింది పూర్తిచేయాలని కోరారు. అలాగే రుణాల మంజూరు విషయంలో మిగిలిన రూ.3.20కోట్లు మార్చి నెలాఖరుకు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

31న జాబ్‌మేళా

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో ఈ నెల 31న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రాధాకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో హెటిరో ల్యాబ్స్, రెడాక్స్ ల్యాబ్స్, ఎస్‌బీఐ కార్డ్ సంస్థల్లో ఖాళీలు భర్తీ చేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ, బీటెక్, ఐటీఐ (ఫిట్టర్), బీఎస్సీ/ఎమ్మెత్సు కెమిస్ట్రీ చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు రెజ్యూమ్, ఫొటోలు, ఆధార్, మార్క్స్ మెమో కాపీలతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 94405 37105 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



మాట్లాడుతున్న పట్టణ మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

సాలూరు: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని పట్టణ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వచ్చే నెల 2 వరకు రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అందరూ పాటించాలని, అధిక వేగంతో వాహనాలను నడపరాదని సూచించారు. కార్యక్రమంలో అధికారులు గంగమ్మ, జీఎం రావు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'చేదోడు' దరఖాస్తులపై ఆరా

జియ్యమ్మవలస: మండలంలోని శిఖబడి సచివాలయంలో చేదోడు దరఖాస్తులపై ఎంపీడీఓ ఎస్.రమేష్ శుక్రవారం ఆరా తీశారు. చేదోడు దరఖాస్తులు ఎంతవరకు అప్లోడ్ అయ్యాయని ఆరా తీయగా 46 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్ఫేర్ అసిస్టెంటు తెలపగా కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆదాయ ధ్రువపత్రాలు అందజేయలేదని తెలిపారు. వెంటనే తహసీల్దార్‌ను ఫోన్‌లో మాట్లాడి ఆదాయ, ధ్రువపత్రాలు లబ్ధిదారులకు అందేటట్లు చర్యలు తీసుకున్నారు. దానితో లబ్ధిదారులు ఊపిరి పీల్చుకున్నారు.

హంస వాహనం వితరణ



పాలకొండ రూరల్: నక్కలపేటలో వేంచేసి ఉన్న జ్ఞానసరస్వతీ ఆలయానికి పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బెజ్జిపురపు లక్ష్మీనారాయణ దంపతులు రూ.25వేల విలువ గల హంసవాహనం వితరణగా అందించారు. ఈ వాహనంపై శుక్రవారం అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త, పి.కొండలరావు, అర్చకులు పి.శరత్‌కుమార్‌ల నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.

మాతా సన్నిధిలో పూజలు



భక్తులచే ఉద్యాపన పూజలు చేయిస్తున్న అర్చకులు

భామిని: ఆంధ్రా – ఒడిశా సరిహద్దు బత్తిలిలో వెలిసిన సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆంధ్రా – ఒడిశా గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఉద్యాపనలు, కుంకుమ పూజలు చేయించారు. ఆలయ ప్రధానార్చకుడు రంపా తాతబాబు శర్మ, అర్చకులు సీతారాం భట్టు ఆధ్వర్యంలో మహిళల చేత ప్రత్యేక పూజలు చేయించారు.

గడప గడపకూ 'సంక్షేమ' ఫలాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

మెంటాడ:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో గడప గడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. శుక్రవారం మండలంలోని బడేవలస గ్రామంలో రెండోరోజు జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి, మూడున్నరేళ్లగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన కొనసాగుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల బాగోగుల కోసం నిరంతరం పరితపిస్తున్నారన్నారు. ఆయన ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు వచ్చాయన్నారు. ఎన్నో ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. మరెన్నో సంక్షేమ పథకాలు అర్హులకే అందుతున్నాయన్నారు.



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీదేనన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పాలనకు నిదర్శమన్నారు. ప్రజల్లో పార్టీకి పెరుగుతున్న ఆదరణను చూసి, ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. గతంలో ఎన్నో హామీలు ఇచ్చి, విస్మరించిన టీడీపీకి మరో అవకాశం ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ విజయభేరి మోగిస్తుందన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఆ దిశగా అడుగులు వేయాలని డిప్యూటీ సీఎం కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మీసాల పార్వతి, ఎంపీటీసీ సువ్వాని విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న స్వచ్ఛ సంకల్పం పనులు నిర్వహించాలి

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛ సంకల్పం పనులను గ్రామ పంచాయతీ కార్యదర్శులు కూలీలతో చేపట్టాలని ఎంపీడీఓ బి. కృష్ణమహేష్ రెడ్డి సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, జగనన్న స్వచ్ఛసంకల్పం పనులు చేయించాలని, ఇంటి పన్నులు వసూలు చేయాలని స్పష్టం చేశారు. అలాగే జగనన్న లే అవుట్లలో ఇళ్లనిర్మాణాలు వేగవంతం చేయడానికి లబ్ధిదారులను చైతన్య పర్చడానికి ఏర్పాటు చేసిన ఇంటి కోసం గంట సమయం కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకులు, వీఓఏ, పంచాయతీ కార్యదర్శి, హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్‌లు



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

పాల్గొని అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి ఐదుగురు ప్రతినిధులు సమన్వయంతో పని చేసి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయించాలని, అలాగే ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిరులకు అర్థించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికార సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో క్షేత్రస్థాయి భూసర్వే

బలిజిపేట: మండలంలోని శ్రీరంగరాజపురంలో డ్రోన్ సర్వే అనంతరం క్షేత్రస్థాయిలో భూసర్వేను రెవెన్యూ సిబ్బంది శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో 571.41ఎకరాల ప్రభుత్వ జిరాయితీ భూమి ఉంది. ఓఆర్ఐ షీట్లు, టైల్స్‌తో దీనికి సంబంధించి సాగు హక్కులో రైతులు ఎవరున్నారు? వారికి ఏవిధంగా భూమి సంక్రమించింది అనేదానిని గుర్తిస్తున్నారు. సర్వే పూర్తయిన తరువాత రైతులకు సంబంధించిన వివరాలతో గ్రామసభ నిర్వహించి అభ్యంతరాలను తెలుసుకుంటారు. ఆ ప్రక్రియ పూర్తయిన తరువాత జగనన్న శాశ్వత భూహక్కు పుస్తకాలను రైతులకు అందించనున్నారు. చిలకలపల్లిలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో



క్షేత్రస్థాయిలో భూసర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

మంగళవారం డ్రోన్ సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ మనోజ్, రెండు సర్వే బృందాలు, రైతులు పాల్గొన్నారు.

పశువైద్య సంచార సేవ వాహనం మంజూరు

సీతానగరం: అత్యవసర సమయంలో పశువులకు వైద్య సేవలందించడానికి డాక్టర్ వైఎస్ఆర్ సంచార పశు వైద్యసేవ వాహనాన్ని సీతానగరం సబ్‌డివిజన్‌కు ప్రభుత్వం మంజూరు చేసిందని సబ్‌డివిజన్ పశువైద్య సహాయసంచాలకుడు డాక్టర్ సీహెచ్ దీనకుమార్ తెలియ జేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పశువులకు అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలందించడానికి, రోడ్డు ప్రమాదాల్లో గాయపడినా, ఈత సమయంతో వైద్య సేవలందించడానికి పశువైద్య సంచార పశు వైద్య సేవ వాహనంద్వారా సేవలు అందిస్తామని తెలిపారు. ఈ వాహనాన్ని సీతానగరం, బలిజిపేట మండలాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంచార పశువైద్య సేవ వాహనంలో వైద్య సేవలందించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలతో నిరంతరం వైద్యాధికారి, సిబ్బంది ఉంటారన్నారు. ఫిబ్రవరి 1 నుంచి సంచార వాహనం ద్వారా సేవలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీతానగరం,బలిజిపేట మండలాల పశువైద్యాధికారులు ఎస్.రామారావు, జి.గణేష్ పాల్గొన్నారు.



సీతానగరం పశువైద్య సబ్‌డివిజన్‌కు చేరిన పశువైద్య సంచార వాహనం

కేంద్ర విధానాలకు నిరసనగా ట్రాక్టర్ల ర్యాలీ

పార్వతీపురం టౌన్: రైతువ్యతిరేక మూడు నల్లచట్టాలను రద్దు చేస్తామని కేంద్రప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రెతుపండించిన పంటలకు మద్దతు ధరల చట్టం తేవాలని, ఢిల్లీలో రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలో వామపక్షాలు శుక్రవారం ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించాయి. ఈ ర్యాలీ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ నుంచి సుందరయ్య భవనం వరకు సాగింది. ఈ సందర్భంగా రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ రైతుల దీక్షలను విరమించేందుకు ప్రధాని మోడీ ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, ఈదుబిల్లి వెంకటనాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు బంటుదాసు, కరణం రవీంద్ర, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఊయక ముత్యాలు, పి.శ్రీను నాయుడు (సంయుక్త, కార్యదర్శి), అఖిల భారత రైతు కూలీసంఘానికి చెందిన బొత్స నరసింగరావు, పోల రమణి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న వామపక్ష నాయకులు

పరిసరాల పరిశుభ్రత కీలకం

- డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: అనారోగ్య సమస్యల నివారణలో పరిసరాల పరిశుభ్రత కీలకపాత్ర వహిస్తుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మండలంలోని ఎమ్మార్‌నగరంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నీటి నిల్వలు దోమలకు ఆవాసాలుగా మారి వివిధ రకాల రోగాలకు కారణమవుతాయన్నారు. ముఖ్యంగా ఉపయోగంలో లేని రుబ్బురోళ్లు, కొబ్బరి టెంకలు, పాడైన ప్లాస్టిక్ వస్తువులు, సీసాలు, టైర్లలో నిల్వ నీరు లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అదేవిధంగా చెత్తను ఇంటి ఆవాసాల్లో పారవేయకుండా చూసుకోవాలని తెలిపారు. అనంతరం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఎప్పటికప్పుడు ఈ ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని డీఐఓ జగన్‌మోహన్ రావు వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయ గౌడ్, ఏఎన్ఎం జె.పోలమ్మ, సచివాలయం సిబ్బంది, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

ఉపాధి వేతనదారులు సమయ పాలన పాటించాలి



ఆన్‌లైన్ మస్తరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

- ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

సీతానగరం: ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొనే మండలంలోని వేతన దారులు సమయ పాలన పాటించి, గిట్టుబాటు వేతనం పొందాలని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం అప్పయ్యపేట చెరువులో ఉపాధి పనులు చేస్తున్న వేతన దారుల మస్తరును పరిశీలించి, చేస్తున్న పనులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం రూ.230 వేతనం కిట్టుబాటయ్యేలా ప్రతి తన దారు పని చేయాలని కోరారు. ప్రతి రోజూ రెండుపూటలా ఉపాధి పనులు చేయాలని సూచించారు. ప్రజావసరాలకు అనుగుణంగా ఉపాధి హామీ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. జాబ్ కార్డులున్న వేతనదారులందరికీ పనులు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకుడు అప్పలనాయుడు, వేతన దారులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు మద్దతు

పార్వతీపురం: జనవరి 30,31 తేదీలలో నిర్వహించనున్న బ్యాంకుఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథ రావు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు కరపత్రాలను పంపిణీ చేశారు. వేతన సవరణ, ఖాళీల భర్తీ, పీఎం మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, తదితర సమస్యలపై సమ్మెను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎస్ఐ రామరావు

గరుగుబిల్లి: ఎరువుల దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్ ఎస్ఐ రామారావు హెచ్చరించారు. ఖడ్గవలస జంక్షన్‌లో గాయిత్రి జనరల్ స్టోర్స్, శ్రీరామాంజేయ ట్రేడర్స్ దుకాణాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలను, స్టాక్ రిజిస్ట్రేషన్‌లను, ధరల పట్టికలను పరిశలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసి ఎరువులకు విధిగా రశీదును అందించాలన్నారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులను రద్దు చేయడం జరుగుతుందన్నారు. ఈ పరిశీలనలో ఏఓ ఆర్.విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత



మాట్లాడుతున్న మోటార్ వెహికల్ అధికారి వేణుగోపాలరావు

పాలకొండ రూరల్: రహదారి ప్రమాదాలు నివారించేందకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. డిపోలో 34వ రోడ్డు భద్రత వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాలకొండ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరావు మాట్లాడుతూ వాహనచోదకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ నిబంధనలు, సిగ్నల్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహాయ మోటార్ వెహికల్ అధికారి కిరణ్‌కుమార్, ఆర్టీసీ డిపోలో వివిధ శాఖల అధికారులు ఎస్.లక్ష్మణరావు, ఎంకెఎం.రాజు, పి.మధుబాబు, బి.రాంబాబు, ఎస్.నాగరాజు, పీపీ.ఆచారి, బీకే.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'భోజనం' రుచిగా ఉండాలి



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్

భామిని: మండలంలోని బాలేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్ ఆధ్వర్యంలో పరిశీలించారు. పీఎంసీ చైర్మన్ కె.ఆంజనేయులతో కలిసి మెనూ ప్రకారం చేసిన ఎండీఎం వంటలను రుచి చూశారు. విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడేలా భోజనం ఉండాలన్నారు. భోజన నాణ్యతపై రాజీ పడవద్దని సూచించారు. విద్యార్థులకు భోజనం వడ్డించారు. వారి వెంట హెచ్‌ఎం జామి రమేష్, తెలుగు ఉపాధ్యాయుడు నిమ్మల మోహనరావు ఉన్నారు.

బాలయోగి గురుకులంలో విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శిరీష

సీతానగరం: విద్యార్థులు విద్యతోపాటు ఆరోగ్యం పట్ల జాగ్రత్త పాటించాలని సీతానగరం ఆర్‌సీహెచ్ డాక్టర్ శిరీష సూచించారు. ఈ మేరకు శుక్రవారం జోగింపేట బాలయోగి బాలుర గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు సిబ్బంది సహకారంతో ఆమె ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ బాలయోగి గురుకులం విద్యార్థులు తమ ఆరోగ్యాన్ని చూసుకుని మంచిగా చదువుకుని ప్రభుత్వం కల్పిస్తున్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నిర్వహించిన వైద్యశిబిరంలో విద్యార్థులందరికీ ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అంద జేశారు. మరికొందరికి ఆరోగ్యంగా ఉండడానికి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎం.సింహాచలం, ఏఎన్ఎం చైతన్య,హెల్త్ అసిస్టెంట్ ఐ.హరికృష్ణ, ఆశావర్కర్, గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఈశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ధాన్యం నిల్వ వివరాలు మొబైల్ ద్వారా పంపించాలి

సీతానగరం: మండలంలోని రైతుల కళ్లాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని మొబైల్ యాప్ ద్వారా రైతు భరోసా వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలని ఏఓ ఎస్. అవినాష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఈకేవైసీ, ఈ క్రాప్ చేయించని ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతుల కళ్లాల్లోనే ఉన్నాయన్నారు. ధాన్యం నిల్వలున్నట్లు జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేసేందుకు వ్యవసాయ శాఖ యాప్‌ను రూపొందించిందని, ఆ యాప్‌లో రైతుల కళ్లాల్లో ఉన్న ధాన్యం నిల్వలు పొందుపర్చాలని సూచించారు. ఇప్పటికే వ్యవసాయ సిబ్బంది రైతుల కళ్లాల్లోని ధాన్యం నిల్వలను గుర్తించినట్లు తెలియ జేశారు. కార్యక్రమంలో గాదెలవలస మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు బి. సత్యనారాయణ, ఏఈఓ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఓ ఎస్.అవినాష్

జీరో యాక్సిడెంట్ లక్ష్యం వైపు అడుగులు వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రవాణా అధికారి ఇ.మల్లికార్జున రెడ్డి

- జిల్లా రవాణా అధికారి ఇ.మల్లికార్జున రెడ్డి

పార్వతీపురంటౌన్: జీరో యాక్సిడెంట్ లక్ష్యం వైపు అడుగులు వేయాలని జిల్లా రవాణా అధికారి ఇ.మల్లికార్జున రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతా వారోత్సవాలను జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు చేపట్టవలసిన ముందు జాగ్రత్త చర్యలపై వారం రోజుల పాటు రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రమాదాలపై డ్రైవర్‌లు అవగాహన కలిగి ఉండడం వల్ల జీరో యాక్సిడెంట్ లక్ష్యం వైపు అడుగులు వేయవచ్చని అభిప్రాయపడ్డారు. ముందు జాగ్రత్త చర్యగా వాహనాలను రోడ్డుకు ఎడమవైపున, రోడ్డు పక్కకు ఆపాలని డ్రైవర్‌లకు సూచించారు. కార్యక్రమంలో డీటీఓ శశికుమార్, ఎంవీఐ బి.కాశీరాం నాయక్, ఇన్‌చార్జ్ డిపో మేనేజర్ ఒ. సుమిత్ర, డ్రైవర్‌లు, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మా పొలాలకు దారి చూపరూ...

వీరఘట్టం: తమ పొలాలకు వెళ్లేందుకు దారిని చూపించాలని పలువురు రైతులు తహసీల్దార్ సి.హెచ్.సత్యనారాయణను శుక్రవారం కోరారు. పాలకొండ రోడ్డులో భారత్ గ్యాస్ గోదాం ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న భూముల్లో కొందరు రియల్ ఎస్టేట్ వెంచర్లు వేయగా, మరి కొందరు తమ పొలాలకు కంచెలు వేస్తుండడంతో వెనుక ఉన్న తమ పొలాలకు దారి లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. రోడ్డు పక్కన భూముల్లో ఇలా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తే వెనుకన ఉన్న భూములకు మార్గం లేక బీడు భూములుగా మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అందుచే తమ పొలాలకు వెళ్లేందుకు దారి చూపించాలని వీరు కోరారు. దీనిపై తహసీల్దార్ సత్యనారాయణ స్పందిస్తూ సంబంధిత భూ యజమానులను పిలిపించి మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ చూపిస్తానని తెలిపారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు